

రంజాన్ వేళలు

| | |
|---|---|
| ఇఫ్తార్ శనివారం | 6:38 |
| సహర్ ఆదివారం | 4:44 |

### చలివేంద్రాల ఏర్పాటు

మెట్‌పల్లి, ఏప్రిల్, 5 : ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ అన్నారు. శుక్రవారం పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్ రత్నాకర్, టీపీవో రాజేంద్రప్రసాద్, ముజీబ్, సోమిడి శివ, వాల్గోట్ నరేష్, నిజాం, అశోక్, జాబేర్, షకీల్, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు ఐరిస్

- అక్రమాలకు చెక్
- కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ
- జిల్లా వ్యాప్తంగా 417 కొనుగోలు కేంద్రాలు
- 5.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం



కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు(ఫైల్)

జగిత్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దళారీ వ్యవస్థను కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో బాగంగా పౌరసరఫరాల శాఖ నూతనంగా ఐరిస్ విధానం తీసుకొచ్చింది. గతంలో ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా ధాన్యం కొనుగోలు చేసే వారు. తాజాగా ఓటీపీతో పాటు ఐరిస్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో అక్రమాలకు చెక్ పడనుంది. జిల్లా వ్యాప్తంగా 417 కొనుగోలు కేం ద్రాలను ఏర్పాటు చేయాలని యంత్రాంగం నిర్ణయించింది. ఇప్పటికే 410కి పైగా కేంద్రాలను ప్రారంభించారు.

### గతంలో ఇలా...

గతంలో రైతులు ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతాను నమోదు చేస్తే వారి సెల్‌ఫోన్‌కు ఓటీపీ వచ్చేది. దానిని ట్యాబ్‌లో నమోదు చేసి ఓటీపీ ద్వారా ధాన్యం కొనుగోలు చేసేవారు. రైతుల పేరుతో వ్యాపారులు, దళారులు విక్రయిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఐరిస్ అమలు చేయాలని నిర్ణ యించారు. గతంలో ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం తీసుకువచ్చి కొను గోలు కేంద్రాల్లో దళారులు విక్రయించేవారు. అలా అక్రమాలను కట్టడి చేసేందుకు ఐరిస్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ధాన్యం విక్రయించే రైతు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుంది. ధాన్యం కాంటా అయిన తర్వాత సెంటర్ నిర్వాహకులు ఐరిస్ తీసుకోనున్నారు. దీనిపై ఇటీవల కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. కేంద్రాల నిర్వాహకులకు ఐరిస్ యంత్రాలను అధికారులు అందజేస్తున్నారు.

### కౌలు రైతుగా నమోదు చేసుకోవాలి...

కౌలు రైతుల మొదట ఏఈవోలను కలిసి ఎవరి భూమిని కౌలుకు తీసు కున్నారో వివరాలు నమోదు చేయించాలి. ఈ వివరాలను ఏఈవో ఓపీ ఎంఎస్ (ఆన్‌లైన్ పొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)లో నమోదు చే యనున్నారు. దీంతో కౌలు రైతు సైతం తాను పండించిన ధాన్యం విక్ర యించుకునే అవకాశం ఉంటుంది. జిల్లాలో సుమారుగా 20వేల వరకు కౌలు రైతులు ఉన్నట్లుగా అంచనా ఉంది.

### అందుబాటులో గోనె సంచులు..

జిల్లా వ్యాప్తంగా 417 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అందులో 134 ఐకేపీ, 282 పీఏసీఎస్, 1 మెప్మా ఆధ్వర్యంలో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. 5.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం సుమారు 75 లక్షల గోనె సంచులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి రూ. 2,203, బీ గ్రేడ్ రకానికి రూ. 2,108 ధరను నిర్ణయించింది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

### పకడ్బందీగా కొనుగోళ్లు



**వెంకటేశ్వర్ రావు, జిల్లా సివిల్ సప్లయి అధికారి**

జిల్లా వ్యాప్తంగా 417 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఓటీపీ పాటు కొత్తగా ఐరిస్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ధాన్యం విక్రయించే రైతు తప్పకుండా కొనుగోలు కేంద్రానికి రావాలి. కౌలు రైతులు ముందుగానే ఏఈవో దగ్గర తమ వివరాలను నమోదు చేసుకోవాలి. ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని సిద్ధం చేశాం.

### కొనుగోళ్లు సరే...ప్రోత్సాహకమేదీ...?

ఆరుగాలం శ్రమించి పండించిన రైతులకు పంట దిగుబడుల బోనస్ ఇస్తామని శాసన సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీనిచ్చింది. దీంతో పాటు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పింది. వాటిలో కొన్నింటికి ఇప్పటికే అమలు చేస్తోంది. యాసంగిలో సాగు చేసిన ధాన్యం రైతులకు క్వింటా ధాన్యంపై రూ. 500 ప్రోత్సాహకంగా బోనస్ ఇస్తారన్న ప్రచారం జరిగింది. గత యాసంగి కంటే ఈ సారి అధిక విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేశారు. ఇప్పుడిప్పుడే పంట దిగుబడులు చేతికి వస్తున్న తరుణంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా యాసంగి ధాన్యం కొనుగోళ్లపై బోనస్ ఇస్తామన్న ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి స్పష్టత నివ్వడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు పంట దిగుబడులను ఇప్పుడే అమ్మాలా.. వద్దా..అన్న సందిగ్ధంలో ఉన్నారు. ధాన్యం సేకరణ ప్రారంభించిన నేపథ్యంలో ప్రోత్సాహకంపై స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

### ప్రైవేటులో విక్రయాలు...

యాసంగి సీజన్‌లో పండిన ధాన్యం కొనుగోలు కోసం కేంద్రాలను ప్రారంభిస్తున్నా రైతులు మాత్రం వ్యాపారులకే విక్రయించడానికి మొగ్గు చూ పుతున్నారు. రైస్ మిల్లర్లు, వ్యాపారులు గ్రామాల్లోకి వచ్చి ఒప్పందం చేసుకోవడంతో పాటు వారం, 15 రోజుల గడువులోగా డబ్బులు చెల్లించడానికి అంగీకరిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే తేమ శాతం నిర్ణీత మొత్తంలోనే ఉండాలి. క్వింటాలుకు 3 కిలోల నుంచి 5 కిలోల వరకు తరుగు తీసే అవకాశం ఉంది. హమాలీ చార్జీలను రైతులు భరించాల్సి వస్తుంది. ఈ మూడు రకాలుగా ఇబ్బందులు పడే కంటే వ్యా పారులకే వడ్లు విక్రయిస్తే ఎలాంటి సమస్య ఉండదని రైతులు బావిస్తు న్నారు. సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,200 నుంచి రూ. 2,300 ధరకు వ్యాపారులు చెల్లిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్నరకాలకు బీ గ్రేడ్ ధరనే వర్తిస్తుంది. దొడ్డు రకాలకు ఏ గ్రేడ్ ధర అమలు చేయడం, ని బంధనలు కఠినంగా ఉండడంతో రైతులు మిల్లర్లు, వ్యాపారులకే విక్రయిం చడానికి ఆసక్తిని చూపుతున్నట్లు తెలుస్తోంది.

## భానుడి భగ భగ

### పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 5: భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రోజు రోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ మొదటి వారం నుంచే ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఉదయం 9 గంటల నుంచే ఉష్ణోగ్రతలు పెరిగిపోతూ మధ్నాహ్నం 12 గంటలకు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ప్రజలు బయటకి వచ్చేందుకు జంకుతున్నారు. రెండు, మూడు రోజులుగా జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోతున్నాయి. జిల్లాలో శుక్రవారం బీర్‌పూర్ మండలం కొల్వాయిలో అత్యధికంగా 42.6 డిగ్రీలు నమోదు అయ్యింది. కోరుట్లలో 42.5, ధర్మపురి మండలం నేరెల్లలో 42.4, మేడిపల్లిలో 42.2, మెట్‌పల్లిలో, కొడిమ్యాల మండలం తిర్మాలాపూర్‌తో పాటు ఇబ్రహీంపట్నం గోధూర్‌లో 41.8 చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మల్లాపూర్ మండలం రాఘవపేటలో, ధర్మపురి మండలం జైనాలో 41.7 చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

### కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా




మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్ రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. జగ్జీవన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. జగ్జీవన్ రామ్ చేసిన సేవలు భావితరాలకు ఉపయోగపడుతున్నాయన్నారు. సమాజం కోసం, అన్ని వర్గాల సంక్షేమానికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకర, అదనపు ఎస్పీ వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి రాజ్ కుమార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యానారాయణ రావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్, బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎకరాకు రూ. 25వేలు నష్టపరిహారం ఇప్పించాలి

### మాజీ సీఎం కేసీఆర్‌ను కోరిన శ్రీరాములపల్లి రైతు



గోడు వెల్లబోసుకుంటున్న రైతు

కొడిమ్యాల, ఏప్రిల్ 5 : గత పదేళ్లలో తన పొలం ఎప్పుడూ ఎండి పో లేదని, 11 ఎకరాలలో వరి సాగు చేస్తే అయిదెకరాలు ఎండిందంటూ మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన చల్ల వెంటొరెడ్డి అనే రైతు మాజీ సీఎం కేసీఆర్ ముందు గోడు వెళ్ల బోసుకున్నాడు. శుక్రవారం చొప్పదండి నియోజకవర్గంలోని బోయినిపల్లికి కేసీఆర్ ఎండిన పంటల పరిశీలనకు రాగా రైతు వెంకట్‌రెడ్డి వెళ్లి తనకు రైతుబంధు కేవలం నాలుగెకరాల వరకే పడిందని,మిగతా ఏడెకరాల రైతు బంధు పడలేదన్నాడు. ఎండిన 5 ఎకరాల వరి పంటకు ఎకరాకు 25వేల రూపాయల నష్టపరిహారం ఇప్పించాలని కేసీఆర్‌ను కోరారు. స్పందించిన కేసీఆర్ నష్టపరిహారం ఇప్పించెందుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్లు రైతు వెంకట్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ ఉన్నారు.

## ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి గ్రామస్థుల ఫిర్యాదు

సారంగాపూర్, ఏప్రిల్, 5 : పోలీస్ స్టేషన్ నుంచి గంజాయి మాయం కావడం పట్ల విచారణ నిమిత్తం పోలీసులు పలు గ్రామాలకు చెందిన యువకులను విచారణ పేరుతో ఇబ్బందులు గురుచేయడంతో యువకుల తల్లిదండ్రులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పోలీసులతో మాట్లాడుతూ నిందితులను గుర్తించాలి కానీ అమాయక యువకులను ఇబ్బందులకు గురిచేయవద్దని పోలీసులకు సూచించారు.

## జ్యోతి విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని జ్యోతి హై స్కూల్ ఐఐటీ అకాడమీకి చెందిన విద్యార్థులు సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్ సివి రామన్ యంగ్ జీనియస్ అవార్డ్స్‌లో ప్రతిభ చాటారు. పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థి రాధాకృష్ణ, రిషికేష్ జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు, శ్రీపాద వల్ల జిల్లా స్థాయిలో ద్వితీయ ర్యాంకును కైవసం చేసుకున్నారు. హైద్రాబాద్ పంజాగుట్టలోని శ్రీనగర్ కాలనీలో గల శ్రీ సత్యసాయి నిగమగామంలో జరిగిన సూచిర్ ఇండియా 31వ సివి రామన్ అవార్డ్స్ కార్యక్రమంలో అస్కార్ అవార్డు విన్నర్ చంద్రబోస్, డీఆర్‌డీవో సతీష్‌రె డ్డి చేతుల మీదుగా అవార్డ్సును అందుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరి చరణ్ రావు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ రావు, మౌనక రావు, అజిత అభినదించారు.

## లక్ష్మీనారాయణ స్వామి ఆలయ వార్షికోత్సవం

కోరుట్ల, ఏప్రిల్ 5 : పట్టణంలోని లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి పూజారులు అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రత్యేక పూ జలలో పాల్గొనగా అన్నదానం కార్యక్రమంను ప్రారంభించారు. దేవాలయంకు విచ్చేసిన ఎమ్మెల్యేకు నిర్వాహకులు సన్మానించారు. దేవాలయ నిర్వహకులు భక్తులు పాల్గొన్నారు.

## నీటి కుండీల ఏర్పాటు

కోరుట్ల, ఏప్రిల్ 5 : జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేర కు మున్సిపల్ కమిషనర్ తిరుపతి వారి సిబ్బందితో కలిసి పశువులు, మేకలు, గోర్రెలు, ఇతర జంతువులు ఎండ తాకిడి తట్టుకోవడానికి నీటి తొట్టిలను, కుండీలను ఏర్పాటు ఏర్పాటు చేశారు. శుక్రవారం పట్టణంలోని డివైర్డర్లు, పట్టణ శివారులోని జాతీయ రహదారి, అయిలా పూర్, వేములవాడ రోడ్లులలో నీటి తోటీలను ఏర్పాటు చేసి పశువుల తాగు నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. రోజు రోజుకూ ఎండ తీవ్రత ఎక్కువ అవుతున్నందుకు మూగ జీవాలకు దాహం తీర్చేందుకు ఈ ఏర్పాట్లు చేహామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాగితాలకే పరిమితమైన పసుపు బోర్డు

● రైతు సమస్యల పరిష్కారంలో బీజేపీ విఫలం ● ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 5 :పసుపు బోర్డు కేవలం కాగితాలకే పరిమితమైందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిపై బీజేపీ నాయకురాలు బోగ శ్రావణి చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండించారు. జగిత్యాల అభివృద్ధికి బాటలు వేసిన జీవన్‌రెడ్డిని విమర్శించే స్థాయి శ్రావణికి లేదన్నారు. అవాకులు, చెవాకులు, పేరు, ప్రఖ్యాతల కోసం అనవసరపు ఆరోపణలు చేస్తే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ 10 ఏళ్ల కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతు సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. షుగర్ ఫ్యాక్టరీని ఎందుకు తెరిపించలేదని ప్రశ్నించారు. ఎంపీగా అర్వింద్ ఐదేళ్లు ఉండి ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధిని చూసి ఓట్లు అడగాలని హితవు పలికారు. కాగితాల్లోనే పసుపు బోర్డును చూపిస్తూ ఓట్లు అడగడం చేతకాని తనానికి నిదర్శనమన్నారు. రైతులు తమ సమస్యలపై ఢిల్లీలో ఆందోళనలు చేస్తే కనీసం ప్రధాని నోరు కూడా విప్పలేదన్నారు. ఒక వర్గానికి కొమ్ముకాయకుండా అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ ఓటర్లు ఇప్పటికే డిసైడ్ అయి జీవన్‌రెడ్డిని గెలిపించుకుంటున్నారనే భయంతో అర్వింద్ మతి భ్రమించి ఇష్టారీతిన మాట్లాడుతున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉన్న సమయంలో నష్టపోయిన రైతులకు ఏనాడైనా రూ. 10 వేల పంట నష్ట పరిహారం చెల్లించారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు రైతులను దోచుకుంటున్నా జిల్లాకు మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ కనీసం పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేసేలా సీఎం రేవంత్ రెడ్డి చర్యలు చేపడుతున్నారన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఓటర్లు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి, అనుభవం ఉన్న వ్యక్తి జీవన్‌రెడ్డిని ఆశీర్వ దించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్త మోహన్, ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, నాయకులు గుంటి జగదీశ్వర్, మహంకాళి రాజన్న, గాజుల రాజేందర్, జిల్లా గంగాధర్, చాంద్ పాష, దేవేందర్ రెడ్డి, సత్యనారాయణ, గంగాధర్ ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 5 : కాంగ్రెస్ పార్టీతోనే గ్రామల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శుక్రవారం మండలంలోని సర్పరాజుపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన వారు మాజీ జడ్‌పీటీసీ సభ్యుడు తోట గంగాధర్, మండల అధ్యక్షుడు కొంతం రాజం జువ్వాడి నర్సింగ రావు, జువ్వాడి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలో నిజామాబాదు ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని బారీ మెజార్టీతో గెలిపించాలని కొరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ గౌడ్, సంజీవ్ రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## నష్టపోయిన మామిడి రైతులను ఆదుకోవాలి

రాయికల్, ఏప్రిల్ 5: నష్టపోయిన మామిడి రైతులను ఆదుకోవాలని జిల్లా రైతు నాయకుడు మెక్కొండ రాంరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యానవన పంట అయిన మామిడి పంట సాగు చేస్తున్న రైతులు గత నాలుగు సంవత్సరాలుగా నష్టపోతున్నారని, వాతావరణ పరిస్థితులు అను కూలించనే రాలిపోతుందన్నారు. కాసిన కొన్ని చెట్లకు తేనె మంచు, మంగు, పండు ఈగ సోకి తినడానికి, అమ్మకానికి వీలు లేకుండా ఉందన్నారు. రైతులు ఏడాదికి ఒకసారి కాతకు వచ్చే ఈ తోటలను దున్నించడం, నీళ్లు పారించడానికి కుండీలు, కాలువలు, పిచికారి మందులు, ఎరువులు ఇలా ప్రతి చోట చేస్తున్నప్పటికీ ఒక్క రూపాయి కూడా రావడం లేదన్నారు. గత ప్రభుత్వం ప్రకృతి వనాల మీద ఉన్న దృష్టి ఉద్యానవన పంటల మీద లేకుండా పోయిందన్నారు. ఈ ప్రభుత్వం అయినా మామిడి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

## ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

మెట్‌పల్లి, ఏప్రిల్, 5 : పట్టణంలోని శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వాహకులు ఘనంగా జరిపించారు. శుక్రవారం పట్టణంలోని ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక పంచామృతాలతో అభిషేకాలు, పూజలను పురోహితులు జరిపారు. అనంతరం భక్తులచే లక్ష్మి పూజ, గణపతి పూజలు నిర్వహించినంతరం హోమం వంటి కార్యక్రమాలను జరిపించారు. స్వామి వారి కల్యాణాన్ని పురోహితుడు శేషాద్రి వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతి సంవత్సరం పర్రె వంశీయుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం జరిపిస్తున్నారని ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పర్రె చిన్నయ్య, పర్రె చిన్నరా జయ్య, పర్రె శంకర్, సంతోష్, వినోద్, సురేష్, శంకర్, గంగాధర్, రాజుకుమార్, మహేష్, తేజ, సాగర్, భక్తులు, పాల్గొన్నారు.

## కొమిరెడ్డి రాములు సేవలు మరవలేనివి

మెట్‌పల్లి, ఏప్రిల్, 5 : కాంగ్రెస్ పార్టీ, నియోజక వర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు సేవలు మరవలేనివని పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కొనియాడారు. శుక్రవారం కొమిరెడ్డి రాములు వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ యామ రాజయ్య, నాయకులు జెట్టి లింగం, కొంతం రాజం, సురభి అశోక్, కాశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎకరానికి రూ. 25 వేల నష్ట పరిహారం అందించాలి

● రైతు రుణ మాఫీని వెంటనే అమలు చేయాలి ● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి డిమాండ్



రైతు సత్యాగ్రహ దీక్ష చేస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు

జగిత్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు ఎకరానికి రూ. 25 వేల పంట నష్ట పరిహారం అందించాలని, రైతు రుణ మాఫీని వెంటనే చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్ర వారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఎదుట బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు బీజేపీ కిసాన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సత్యాగ్రహ దీక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దోచుకోవడం, దాచుకోవడం కాంగ్రెస్ నాయకులకు సాధారణంగా మారిందన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రైతాంగం కళ్లు తెరవాలని కోరారు. ఎన్నికల కోడ్ ముసుగులో రైతు రుణ మాఫీని తప్పించుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం లేదని విమర్శించారు. మోసపూరిత వాగ్దానాలు చేసి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాడని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల తదుపరి సీఎంగా రేవంత్ రెడ్డి ఉంటాడో.. ఉండడో.. రుతు పవనాలన్ని ఒకటే సారి వన్‌సైడ్‌గా బీజేపీ వైపు వస్తున్నాయని అన్నారు. రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ చేయాలని, కౌలు రైతులకు ఎకరానికి రూ. 10 వేల సాయం, రైతులకు ఎకరానికి రూ. 25 వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎన్‌డీఎస్ఎల్ కర్మాగార పునరుద్ధరణ బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు.

### కాంగ్రెస్ హామీల అమలు ఏమైందీ..?

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీల అమలు ఏమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బోగ శ్రావణి ప్రవీణ్ ప్రశ్నించారు. మాయమాటలు, మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి హామీల అమలును మరిచిపోయారని ఆరోపించారు. గెలిచిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీనిచ్చారని, అమలు చేయకుండా ప్రస్తుతం ఏ విధంగా ప్రజలను ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ రైతు భరోసా పేరుతో రైతన్నలకు ఇస్తానన్న రూ. 15 వేల సాయం, రైతు కూలీలకు రూ. 12 వేల సాయం ఏమైందని ప్రశ్నించారు. రైతన్నలను రోడ్లపై కూర్చోబెట్టి తుక్కు గూడలో కాంగ్రెస్ సభ చేసుకుంటుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ రావు, జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పడాల తిరుపతి, రైతు నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి, బీర్మూర్ జడ్పీటీసీ పాతా పద్మ రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిల సత్యనారాయణ, యాదగిరి బాబు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కొక్కు గంగాధర్ పాల్గొన్నారు.

## ఒకరి రిమాండ్

కోనరావుపేట ఏప్రిల్ 5: కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి తలుపులు కొడుతూ వస్తువులను ధ్వంసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తి మండలం ఎన్గల్‌కు చెందిన రాజేష్ బుధవారం అర్ధరాత్రి మామిడిపల్లిలోని పలు దుకాణాల డోర్ కొట్టి భయభ్రాంతులకు గురి చేశాడు. రిఫ్రిజిరేటర్లను ధ్వంసం చేశాడు. బాధితుల ఫిర్యాదుతో రాజేష్‌ను అరెస్ట్ చేసినట్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## వాగులో పడి కార్మికుడి మృతి

### - అనాథలైన ఇద్దరు కుమారులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 5: మండలంలోని చౌలమద్ది గ్రామంలోని బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం వచ్చి పూజారి శ్రీనివాస్(30) అను కార్మికుడు వాగులో పడి శుక్రవారం మృతి చెందాడు. గ్రామస్థులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన గ్రామానికి చెందిన శ్రీనివాస్ కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శ్రీనివాస్ భార్య మృతి చెందడంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి పని చేసుకుంటున్నాడు. చౌలమద్ది గ్రామంలోని వాగుపై బ్రి డ్జి నిర్మాణంలో తోటి కూలీలతో కలిసి పనికి వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం వాగులో తోటి కూలీలతో కలిసి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన కూలీలు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే శ్రీనివాస్ నీటిలో మునిగి మృతి చెందాడు. తల్లి, దండ్రిని ఇద్దరిని కోల్పోయిన ఆ ఇద్దరు పిల్లలు అనాధాలుగా మిగిలారు.

## రైలు నుంచి పడి ఒకరి మృతి

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 5: జమ్మికుంట రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి పడి మృతి చెందాడు. మృతుడి వయస్సు 35-40సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుంది. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. గుర్తు తెలియని రైల్లో నుంచి పడటం వల్లే మృతి చెంది ఉంటాడని రైల్వే పోలీస్‌లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

## అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

గన్నేరువరం, ఏప్రిల్ 5: మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన వేములవాడ స్వప్న(32) అనారోగ్యంతో మనస్తాపం చెంది శుక్రవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్వప్న తల్లి కలవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.



## రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే సహించం

### - తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే సహించేది లేదని, మేము మిమ్మల్ని మార్చేస్తామని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. పిల్లి సుధాకర్ చేపట్టిన రాజ్యాంగ రక్షణ యాత్ర శుక్రవారం కరీంనగర్‌కు చేరుకుంది. నగరంలోని కోర్టు చౌరస్తాలో స్థానిక నాయకులు యాత్రకు స్వాగతం పలికారు. సుధాకర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం మూలస్థంభాలుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అది నచ్చని మనువాద, మతతత్వ పార్టీలు ఈ ఎన్నికల్లో 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. అదే జరిగితే మౌలిక సూత్రాల పునాదులు ధ్వంసం అవుతాయని, జీవించే హక్కు, మాట్లాడే హక్కు కోల్పోతామన్నారు. ప్రతీ పౌరుడు ఈ చర్యను ఖండించాలన్నారు. అంబేద్కర్ అందించిన ఓటు హక్కుతో బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మాలలు అప్రమత్తంగా ఉండి ఇలాంటి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కాడె శంకర్, రాష్ట్ర ప్రధానాకార్యదర్శి మేడి అంజయ్య, కార్యదర్శి గూడ కనకయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాళ్ళ వెంకటేష్, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్, కార్పొరేటర్ గంట కళ్యాణి, శ్రీనివాస్, దామెర సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుక అంజనేయులు, మహిళ నాయకురాళ్ళు తీట్ల ఈశ్వరి, ఎలుక దేవయ్య, వెన్న రాజు, కె చందరయ్య, మొగురం రమేశ్, ప్రసాద్, రామచంద్రం, సత్యం, పి భూమ య్య, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో శుక్రవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో అక్కపల్లి గ్రామానికి చెందిన పోతుల గాంధీబాబు, మందాటి సురేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాంధీబాబు తన బైక్‌పై అక్కపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వస్తున్న క్రమంలో ఇటు నుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న అదే గ్రామ వాసి సురేశ్ వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. గాంధీబాబు రెండు కాళ్లు విరిగిపోయాయి. సురేశ్‌కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

## బస్టాండ్‌లో మహిళ వద్ద బంగారం చోరీ

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 5: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న ఓ ప్రయాణికురాలి నుంచి శుక్రవారం 15 తులాల బంగారాన్ని దొంగలు అప హరించారు. మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల్ల రోడ్ ప్రాంతానికి చెందిన సురిగి మంగారాణి తన కూతురుతో కలిసి బీర్‌పూర్ మండల కేంద్రంలో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. తిరిగి మెట్‌పెల్లికి వెళ్లేందుకు కొత్త బస్టాండ్ చేరుకుని బస్సు కోసం వేచి ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మాటల్లోకి దింపి బ్యాగులో ఉన్న 15 తులాల బంగారు నగలను అపహరించారు. తేరుకున్న మంగారాణి తన బ్యాగులో ఉన్న బంగారం చోరీకి గురైందని తెలుసుకుని జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. టౌన్ సీఐతో పాటు ఎస్సై తన సిబ్బందితో బస్టాండ్‌లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## గర్షకుర్తిలో కిడ్నాప్ కలకలం

గంగాధర, ఏప్రిల్ 5: గర్షకుర్తి వాసి కిడ్నాప్‌నకు గురయ్యాడని సోషల్ మీడియాలో వైరల్ కావడం మండలంలో కలకలం రేపింది. కిడ్నాప్‌కు గురైన వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు కొట్టి అడవి ప్రాంతంలో పడేసినట్లు వీడియోలు వాట్సప్ గ్రూపుల్లో వైరల్‌గా మారాయి. గర్షకుర్తికి చెందిన బూత్కురి దావీదు (35) గ్రామంలో సీఏగా పని చేస్తున్నాడు. కాగా మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లినట్లు సమాచారం. శుక్రవారం నిర్మల్ నుంచి జగిత్యాల వెళ్లే రహదారి పక్కన అటవీ ప్రాంతంలో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అటువైపు నుంచి జగిత్యాల వస్తున్న ఓ ట్రాలీ వాహనం యాజమాని దావీదును గుర్తించి ఎవ్వరని ప్రశ్నించాడు. తమది గంగాధర మండలం గర్షకుర్తి అని తనను కిడ్నాప్ చేశారని దావీదు చెప్పాడు. దావీదును వాహన యాజమాని జగిత్యాలకు తీసుకు వచ్చి అతడి బంధువులకు సమాచారం అందించాడు. ప్రస్తుతం దావీదు అతని బావ వద్ద ఉన్నట్లు తెలిసింది. దీనిపై ఎస్సై కిరణ్ రెడ్డిని వివరణ కోరగా గర్షకుర్తిలోని దావీదు ఇంటికి పంపించి వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. కిడ్నాప్‌కు గురైనట్లు దావీదు చెప్పుతున్న వీడియోలు వాట్సప్‌లో వైరల్ అయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ఆయన జగిత్యాలలోని అతని బావ వద్ద ఉన్నాడని వివరించారు. అసలు కిడ్నాప్‌నకు గురైయ్యాడా, లేక ఏమైందనే విషయంపై ఆరాతీస్తున్నామని, అనుమానం ఉంటే ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

## కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్


తిమ్మాపూర్‌లో జేఈఈ పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

తిమ్మాపూర్, ఏప్రిల్5: రెండో విడత జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ మెయిన్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా కొనసాగాయి. అభ్యర్థులను పరీక్ష సమయానికి రెండు గంటల ముందు నుంచే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు షిఫ్టులలో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా కేవలం మండల కేంద్రలోని ఐయాన్ డిజిటల్ జోన్ ఒక్క పరీక్ష కేంద్రాంలోనే జరిగాయి. మొదటి షిఫ్టులో 678 మందికి 612 మంది, రెండో షిఫ్టులో 677 మందికి 620 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లలితకుమారి తెలిపారు.

## కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే


మాజీ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ పార్టీ కండువా వేస్తున్న దీప్‌దాస్‌మున్షీ

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 5: మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి సమక్షంలో, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్‌మున్షీ హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, బీసీ సంఘం నేత బూస అంజయ్య యాదవ్‌ను పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలు, దేశ సమైక్యత కోసం సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ అనుసరిస్తున్న సిద్ధాంతాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌పార్టీలో చేరానని ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరి విష్ణునాథ్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, రాష్ట్ర ఓబీసీ సెల్ సమన్వయకర్త బద్దికుంట శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఇరుకుల్లలో అగ్నిప్రమాదం

- కాలిన సపోటా చెట్లు
- రూ. 20 లక్షల మేర నష్టం అంచనా

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 5: కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి చెందిన సపోటా తోటలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. అక్కడ ఉన్న వాచ్‌మన్ భోజనానికి వెళ్లిన సమయంలో మంటలు అంటుకుని చెట్లు దగ్ధమయ్యాయని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. మధ్యాహ్నం సమయంలో సపోటా తోటలో అగ్నిప్రమాదం జరిగినట్లు సమాచారం అందుకున్న వెంటనే ఫైరింజన్‌తో సహా సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకవచ్చామని తెలిపారు. అగ్నిప్రమాదానికి కారణాలు తెలియలేదని, విచారణ జరుపుతున్నామని అన్నారు. సపోటా చెట్లకు మంటలు అంటుకోవటంతో చెట్లు భారీగానే కాలిపోయాయని తెలిపారు. సుమారు 20 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నామని అన్నారు. సుమారు 10 ఎకరాలలో సపోటా చెట్లు ఉన్నట్లు తెలిపారు.

**● వస్త్ర దుకాణంలో..**

**కరీంనగర్ క్రైం:** కరీంనగర్ టవర్ ప్రాంతంలోని ఒక వస్త్ర దుకాణంలో శుక్రవారం ఉదయం 5 గంట ల సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. భువన కిడ్స్ షాపులో మంటలు అంటుకోవటంతో స్థానికులు కరీంనగర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు అంటుకున్నాయని, ఈ ప్రమాదంలో కొన్ని దుస్తుల, బ్యాంగిల్స్ కాలిపోయాయని ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. సంఘటనపై విచారణ జరుపుతున్నామని అన్నారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో రోడ్డు పక్కన మంటలు అంటుకున్నాయని వచ్చిన సమాచారం మేరకు ఫైరింజన్‌తో మంటలను ఆర్పివేశామని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.


కాలిపోయిన సపోటా చెట్లు

# ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- బీఎస్పీ సెంట్రల్ కో-ఆర్డినేటర్ ఎం బాలయ్య


మాట్లాడుతున్న ఎం బాలయ్య

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే బహుజనులు శాశ్వత బానిసలు అవుతారని, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని బహుజన సమాజ్ పార్టీ సెంట్రల్ కో ఆర్డినేటర్ ఎం బాలయ్య అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ గార్డెన్‌లో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్ముడుపోని నాయకులు కావాలని అన్నారు. వారు మాత్రమే బహుజన ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతారని, అందుకే అమ్ముడుపోని నాయకులు, కార్యకర్తలను తయారు చేసుకోవాలన్నారు. కార్యకర్తలే బహుజన ఉద్యమానికి వనరులు ఇస్తారని అన్నారు. కేంద్రంలో అధికారంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎలక్ట్రోరల్ బాండ్ల పేరిట కార్పొరేట్ కంపెనీల నుంచి వేలకోట్ల రూపాయలు తీసుకొని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆరోపించారు. బహుజన ఉద్యమం ఉన్నత విద్యావంతులకు అర్థం కాకపోవడం బాధాకరమని వాపోయారు. నేడు దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందన్నారు. రాజ్యాంగాన్ని మనం కాపాడుకోవాలని అన్నారు. రాజ్యాంగాన్ని మారిస్తే బీసీలు బానిసలు కారా? అని బీజేపీ నాయకులను ప్రశ్నించారు. తెలంగాణలో కరీంనగర్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఇక్కడ ఎన్నో ఉద్యమాలు పుట్టాయని, అందులో జగిత్యాల జైత్రయాత్ర, సాయుధ రైతాంగ పోరాటాలు ఇక్కడే పురుడు పోసుకున్నాయన్నారు. దేశంలో బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు అన్ని ఒక్కటే అని అన్నారు. కాంగ్రెస్ వారు లౌకిక వాదులు కానేకారని అన్నారు. బీఎస్పీకి తప్ప ఇతర పార్టీకి ఓటేసినా బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వండి మేము రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నాయకులు బాహాటంగా మాట్లాడుతున్నారన్నారు. బహుశా ఇవే చివరి ఎన్నికలేమో అని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దొడ్డె శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జీ అంకని భాను, నిషాని రామచంద్రం, పుప్పాల లింబాద్రి, రాష్ట్ర కార్యదర్శి ఎనగందుల వెంకన్న, దొడ్డె సమ్మయ్య, రంగు సంపత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్లాల శ్రీనివాస్, జగిత్యాల ఇన్‌చార్జి చిర్ర శంకర్, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యాదాసి రవీందర్, పెద్దపల్లి ఇన్‌చార్జి వరికిళ్ళ మల్లేశ్, బాలకల్యాణ్, జిల్లా అధ్యక్షుడు రాజనర్సయ్య, సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి చాకలి రమేశ్ పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంట దగ్ధం


కాలిపోయిన మొక్కజొన్న పంట

సైదాపూర్, ఏప్రిల్ 5: మండలంలోని గొడిశాల గ్రామ శివారులో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తాడూరి రాజకుమార్ అనే రైతు కోతకు వచ్చిన రెండెకరాల మొక్కజొన్న పూర్తిగా కాలిపోయింది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం వేళలో 11కేవీ వైర్ల రాపిడికి నిప్పు రవ్వలు కోతకు వచ్చిన మొక్కజొన్నలో పడడంతో మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని చుట్టు పక్కల పంటలలోకి వెళ్లకుండా మంటలు ఆర్పారు. మంటలు ఆర్పే క్రమంలో రాజ్‌కుమార్ భార్య స్పృహ తప్పి పడిపోయిందని తెలిపారు. రెండకరాల మొక్కజొన్న దెబ్బతినడంతో తనకు సుమారు రూ. 1.50లక్షల వరకు నష్టం వచ్చిందని రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## చికిత్స పొందుతూ రైతు మృతి

- 4న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం


ముత్తయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5: ఈ నెల 4న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిరిపురం ముత్తయ్య (58) అనే రైతు పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు ముత్తయ్య తనకున్న 30 గుంటల భూమిలో వ్యవసాయం చేయడంతోపాటు స్థానికంగా భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఉన్న ఊరిలో ఉపాధి లేకపోవడంతో ఏడాది కిందట రూ.2 లక్షలు అప్పు చేసి కొడుకు శ్రీనివాస్‌ను బహ్రెయిన్ పంపించాడు. మరో రూ.2 లక్షలు అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. చేతిలో డబ్బులు లేకపోవడంతో ఇంటి నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. పనులు లభించక కుటుంబ పోషణ భారంగా మారింది. అప్పులు తీర్చే మార్గం కానరాకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈ నెల 4న పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ముత్తయ్యను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కన్నకొడుకు గల్ఫ్ దేశంలో ఉండడంతో భర్తకు భార్య దేవలక్ష్మీ అంతిమ సంస్కారాలు నిర్వహించడం స్థానికులను కంట తడి పెట్టించింది. మృతుడి భార్య దేవలక్ష్మీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అక్రమంగా నిల్వచేసిన 21 క్వింటాళ్ల గన్‌పౌడర్ పట్టివేత

సైదాపూర్, ఏప్రిల్ 5: సైదాపూర్ మండలంలోని జాగీర్‌పల్లి గ్రామ శివారులో సమాచారం మేరకు ఓ రూంలో అక్రమంగా నిల్వ చేసిన 21.30క్వింటాళ్ల గన్ పౌడర్‌ను హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఏసీపీ శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ హుజూరాబాద్‌కు చెందిన మహేందర్ అనే వ్యక్తి జాగీర్‌పల్లి శివారులోని ఎలాంటి అనుమతులు లేకుండా ఓ రూంలో గన్‌పౌడర్ దాచాడనే సమాచారం మేరకు తనిఖీ చేశామన్నారు. అందులో 142 బాక్సులలో గన్ పౌడర్ ఉందన్నారు. దాని విలువ సుమారు రూ. 74,764 ఉంటుందని వారు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ గన్ పౌడర్‌ను క్వారీలలో శబ్దం రాకుండా బండ పగుల గొట్టడానికి ఉపయోగిస్తారని, దీన్ని పూర్తి అనుమతులతోనే ఉపయోగించాల్సి ఉంటుదని స్థానికంగా చర్చించుకుంటున్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్, సైదాపూర్ ఎస్సై జన్ను ఆరోగ్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 8న మెడికల్ కాలేజీలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: కొత్తపల్లిలోగల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కాంట్రాక్టు పద్ధతిపై ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీ కోసం ఈనెల 8న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు కాలేజీ వెబ్‌సైట్‌లోగల అప్లికేషన్ ఫారం డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు పూరించి ఈనెల ఏడో తేదీలోగా కొత్తపల్లిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో సమర్పించాలని కోరారు. ఈనెల 8న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాలేజీలో నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 5: మండలంలోని నుస్తులాపూర్ వద్ద రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఓ ప్రయివేటు బస్సు ఢీ కొట్టగా తీవ్రగాయలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని రామచంద్రపూర్ కాలనీకి చెందిన చిక్యాల సాగర్‌రావు(69) కారులో హుస్నాబాద్ సమీపంలోని ఓ గ్రామంలో ఓ ఫంక్షన్‌కి స్నేహితులతో కలిసి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండలంలోని నుస్తులాపూర్ వద్ద వాహనం నిలిపివేసి వాటర్ బాటిల్ కొనేందుకు స్నేహితులు ముగ్గురితో పాటు సాగర్ రావు రోడ్డు దాటుతున్నాడు. కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపు అతివేగంగా వచ్చిన ఓ ప్రైవేటు బస్సు రోడ్డు దాటుతున్న సాగర్‌రావును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయలతో సాగర్‌రావు అక్కడికక్కడే మృతి చెందాడు. సాగర్‌రావు( భార్య కుమారుడు, కూతురు ఉన్నారు. సాగర్‌రావు తపాలా కార్యాలయంలో పని చేసి పదవీ విరమణ పొందాడు. సంఘటన స్థలానికి ఎల్ఎండీ ఎస్సై చేరాలు చేరుకొని మృతదేహాన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్టు


దండేపల్లి, ఏప్రిల్ 5 : దండేపల్లి మండల కేంద్రంలోని మల్లన్న గుడిలో, అంబేద్కర్ చౌరస్తాలో ఆటోను దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ అల్లం నరేందర్, ఎస్సై స్వరూప రాజ్ తెలిపారు. శుక్రవారం గూడెం ఫారెస్టు చెక్ పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఆటోతో వచ్చిన తూర్పాటి కనకయ్య (రేకుర్తి కొత్తపల్లి, కరీంనగర్), పత్తి కనక రాజు (హనుమాన్‌నగర్, కరీంనగర్)లను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారన్నారు. నిందితుల నుంచి ఒక ఆటో ట్రాలీ, ద్విచక్ర వాహనంతో పాటు మల్లన్న గుడిలో చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య


రుషి(ఫైల్)

వేములవాడ, ఏప్రిల్ 5: తల్లిని కొట్టాను అన్న పశ్చాత్తాపంతో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వేములవాడలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఉప్పుగడ్డ వీధికి చెందిన నేరెళ్ల అంజయ్య - లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు నేరెళ్ల రుషి (18) తరచూ అర్ధరాత్రి దాటిన తర్వాత ఆలస్యంగా ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటికి వచ్చిన రుషిని తల్లి మందలించింది. తండ్రి తాడి చెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడి మంచాన పడగా ఇలా అర్ధరాత్రిలు రావడం ఏంటని ప్రశ్నించింది. తీవ్ర ఆగ్రహానికి లోనై విచక్షణ కోల్పోయిన రుషి తల్లితో పాటు తండ్రిపై దాడికి పాల్పడ్డాడు. అనంతరం అదే రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన రుషి శుక్రవారం తెల్లవారు జామున ఇంటి పైఅంతస్తుకు చేరుకొని తల్లిని కొట్టిన పశ్చాత్తాపంలో మనోవేదనకు లోనై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వేములవాడ పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు.

## సవతి తండ్రిని హత్య చేసిన తనయుడు


అంబాదాస్(ఫైల్)

మల్లాపూర్, ఏప్రిల్ 5: జల్సాలు మాని పని చేసుకోవాలని మందలించిన సవతి తండ్రిపై కోపం పెంచుకున్న తనయుడు శుక్రవారం హత్య చేశాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..మల్లాపూర్ దుర్గమ్మ కాలనీకి చెందిన అంబాదాస్ (54) తన రెండో భార్య భోజమ్మతో పాటు ఆమె కుమారుడు రవితేజతో కలిసి జీవిస్తున్నారు. రవితేజ పని చేయకుండా జల్సాలు చేసుకుంటూ తిరగడంతో అంబాదాస్ మందలించాడు. ఇలా రోజు ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. అప్పటి నుంచి అంబాదాస్‌పై రవితేజ కోపం పెంచుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో పడుకొని ఉన్న అంబాదాస్‌పై పదునైన ఆయుధంతో మెడపై కొట్టి పారిపోయాడు. తలపై తీవ్ర గాయం కావడంతో అంబాదాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. రక్తపు మడుగులో పడిఉన్న అంబాదాస్‌ను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మె ట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొన్నారు. ఈ మేరకు పరారీలో ఉన్న రవితేజ కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## సైబర్ వలలో మెట్‌పల్లి వాసి

మెట్‌పల్లి, ఏప్రిల్ 5: మెట్‌పల్లి పట్టణానికి చెందిన మొహమ్మద్ ఇమ్రాన్ సైబర్ మోసానికి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 3వ తేదీన సేబర్ మోసగాళ్లు ఇమ్రాన్‌కు ఫోన్ చేసి డిస్కౌంట్ల పేరుతో ఆఫర్ల ఆశ చూపడంతో ఇమ్రాన్ నమ్మాడు. కొంత సమయం తరువాత వారికి ఓటీపీలు చెప్పడంతో కాసేపటికి ఇమ్రాన్ అకౌంట్ నుంచి రూ. 27,440 కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. తరువాత వారికి ఫోన్ చేస్తే కలవకపోవడంతో మోసపోయినట్లు భావించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల సంక్షేమం సాధ్యం

**ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి**



జీవన్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న హన్‌మాన్ దీక్షాపరులు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 5 : కాంగ్రెస్‌పార్టీతోనే అన్నివర్గాల సంక్షేమం సాధ్యమౌతుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో బీఆర్ఎస్, బీజేపీకి చెందిన 100 మంది కార్యకర్తలు కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు జున్ను రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కాంగ్రెస్ కండువాకప్పి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా చల్‌గల్ గ్రామంతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ఉచిత విద్యుత్ అందిస్తూ, పండించిన పంటలకు రైతులకు మద్దతు ధర కల్పించడంలో రైతులకు అండగా నిలిచానని గుర్తు చేశారు. వైఎస్ హయాంలో చల్‌గల్‌లో మామిడి మార్కెట్ ఏర్పాటు చేశానని పేర్కొన్నారు. ఇటీవలే చల్‌గల్ నుంచి ముదిగంపల్లికి సీసీ రోడ్డు వేయించానని తెలిపారు. స్థానికంగా ఉపాధిక రువై గల్ఫ్‌బాట పడుతున్నవారికి కోసం గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తానని జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు. బీడీ కార్మికులకు అండగా నిలుస్తామన్నారు. హన్‌మాన్ దీక్షపరులు జీవన్‌రెడ్డి మద్దతు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అండగా నిలువాలని జీవన్‌రెడ్డి హన్‌మాన్ దీక్షపరులను, ప్రజలను కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ మహేష్, ప్యాక్స్‌వైస్‌చైర్మన్ శీలం సురేందర్, సత్తయ్య పాల్గొన్నారు.

## 'ఎమ్మెల్యే చొరవతో వరదకాలువ రైతులకు న్యాయం'

కథలాపూర్, ఏప్రిల్ 5 : ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్ల వరదకాలువ రైతులకు సంబంధించిన పంటలకు న్యాయం జరిగిందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీసీసీ కార్యవర్గ సభ్యులు చెదలు సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెగ్గెర్లలో వరద కాలువపై ఆధారపడి పంటలు సాగు చేసిన పంటలను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తేగా మూడు సార్లు సంబంధిత అధికారులతో మాట్లాడి రైతుల సమస్యలు తెలిసిన నాయకుడిగా నీళ్ల విడుదల చేయించి పంటలు కాపాడారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు పంటలు ఎండిపోతున్నాయని గగ్గోలు పెడుతుండడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీకి రైతులను రాజుగా మార్చే విధానం తెలుసునని అన్నారు. ఈ సందర్భంగా పాల్తెపు గంగారాం, శ్రీనివాస్, అంజయ్య, బాలు ఉన్నారు.

## 'లక్ష్యం సాధించేందుకు కృషి చేయాలి'



మెట్‌పల్లి డిపోలో డ్రైవర్లకు ప్రశంసాపత్రం అందజేస్తున్న మేనేజర్

మెట్‌పల్లి, ఏప్రిల్, 5 : మెట్‌పల్లి డిపోకు రోజు వచ్చే ఆదాయంలో అదనంగా ప్రతి రోజు ఒక లక్ష సంపాదించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డిపో మేనేజర్ వేదవతి సిబ్బంది సూచించారు. శుక్రవారం డిపో ఆదాయం పెరగడానికి కృషి చేసిన డ్రైవర్లు, కండక్టర్లతో పాటు సిబ్బందికి ప్రగతి చక్ర అవార్డు ప్రశంస పత్రాలను ఆమె అందజేసి సిబ్బందితో డిపో అభివృద్ధికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపోలో మంచిగా విధులు నిర్వహించి ఎక్కువ ఆదాయం రావడానికి కృషి చేసిన వారికి ఆర్టీసీ ఎండీ సజ్జనర్ ఆదేశాల మేరకు ప్రతి నెల ప్రగతి చక్రం అవార్డులను సిబ్బందికి అందజేస్తామన్నారు. దీనిలో భాగంగా అదనంగా ప్రతి రోజు లక్ష సంపాధించేందుకు కార్యాచరణలను చేపట్టాలని ఆర్టీసీ ఎండీ సజ్జనర్ ఆదేశాల మేరకు మన లక్ష్యం లక్ష అనే నినాదానికి సంబంధించిన సూచనలు చేశామన్నారు. లక్ష్యం సాధించేందుకు ప్రయాణికులు ఎక్కడ చేయి ఎత్తిన బస్సు ఆపి ఎక్కించుకోవాలని, ఆర్టీసీని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజి సిబ్బంది, పాల్గొన్నారు.

## 'కొమిరెడ్డి రాములు సేవలు చిరస్మరణీయం'

జగిత్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు సేవలు చిరస్మరణీయమని టీబీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పుప్పాల నారాయణ, హరి నర్సయ్య పటేండ్ల స్మారక భవన్‌లో మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హరి అశోక్ కుమార్ మా ట్లాడారు. విద్యార్థి దశలోనే తెలంగాణ ఉద్యమంలో చురుకుగా కొమిరెడ్డి రా ములు పాల్గొన్నారని గుర్తు చేశారు. 2004 నుంచి 2009 సంవత్సరం వరకు మెట్‌పల్లి ఎమ్మెల్యేగా, జనతా పార్టీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్‌గా ప్రజా సమస్యల పరిష్కారం కోసం విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరే మహేందర్, నాయకులు బండారి విజయ్, సింగం భాస్కర్, లక్ష్మణ్, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

## రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి

జగిత్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కరువు పరిస్థితుల వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లెల్లెల బాల కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో జగిత్యాల జిల్లా రైతు సంఘం ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత యేడాది అనావృష్టితో చెరువులు, కుంటలు ఎండిపోయి, రిజర్వాయర్లు అడగంటిపోయి లక్షల ఎకరాల్లో చేతికొచ్చే దశలో ఉన్న వరి పంట ఎండిపోయి పశువులకు మేతలా మారిందన్నారు. వ్యవసాయ అధికారులు నష్టపోయిన పంటను అంచనా వేసి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎకరానికి రూ. 50 వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తిరుపతి నాయక్, ప్రధాన కార్యదర్శి గర్వందుల రమేశ్, నాయకులు చంద్రయ్య, కొండయ్య, తిరుపతి పాల్గొన్నారు.

## ఇంకుడు గుంత నిర్మాణ పనుల పరిశీలన

ధర్మపురి, ఏప్రిల్ 5: ధర్మపురి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు వృధాగా పోనీయకుండా ఎక్కడికక్కడ ఆ జలాలను ఇంకుడు గుంతలోకి చేర్చాలని అన్నారు. ఆ నీరు ఇంకుడు గుంతలోకి వెళితే భూగర్భ జల మట్టం పెరగడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మున్సిపల్ ప్రజలు ప్రతి ఇంటిలో నీరు వృథా కాకుండా, పడిన నీరంతా భూమిలోకి ఇంకే విధంగా రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్‌ను నిర్మించుకోవాలన్నారు. ఆయన వెంట ఎన్విరాన్ మెంట్ ఈ ఈ మహేష్, మున్సిపల్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్ పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు పలకాలి

**వివిధ కుల సంఘాలను కోరిన జువ్వాడి**

కోరుట్ల, ఏప్రిల్ 5 : రానున్న పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మద్దతు పలుకాలని కొరుతూ శుక్రవారం పట్టణంలోని వివిధ కుల సంఘ సభ్యులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మద్దతు పలుకాలని కోరారు. పట్టణంలోని ఆర్య వైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు కొత్త సురేష్, పట్టణ మాజీ అధ్యక్షులు కొత్త సదీర్, అల్లాడి ప్రవీణ్‌లతో పాటు వివిధ కుల సంఘాల సభ్యులను కలిసి మద్దతు పలుకాలని కొరారు. కాంగ్రెస్ బలపరుస్తున్న జీవన్‌రెడ్డిని బారీ మెజార్టీ గెలిపించాలని కొరారు. మున్సిపల్ మాజీ చైర్మెన్ శీలం వేణుగోపాల్ కౌన్సిలర్ నాగభూషణం, అన్వర్, నాయకులు మధు, సత్యనారాయణ పాల్గొన్నారు.

# సమానత్వం కోసం పోరాడిన వ్యక్తి జగ్జీవన్‌రామ్

**ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్



కోరుట్లలో విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 5 : సామాజిక సమానత్వం కోసం జీవిత కాలం పోరాడిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. భారత దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని ఇంధిరా భవన్‌లో శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. దేశ రక్షణ మంత్రిగా జగ్జీవన్‌రామ్ వేసిన బాటలు దేశాన్ని సురక్షితంగా ఉంచాయన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ బాటలో పయనించి అంటరానివారి శ్రేయస్సుకు జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల గిరి నాగభూషణం, కొత్త మోహన్, విజయ లక్ష్మి, మహంకాళి రాజన్న, సత్యనారాయణ, గాజుల రాజేందర్, దుర్గయ్య, మహిపాల్, రాజిరెడ్డి ఉన్నారు.

**కొడిమ్యాల:** మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం భారత మాజీ ఉప ప్రదాని బాబుజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను దళిత సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేశారు. ఆయన దేశం కోసం చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యక్షుడు ప్రసాద్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు కొత్త్తూరి స్వామి, రాజ్‌కుమార్, మహేష్, రవీందర్, లక్ష్మీనర్సయ్య, నర్సయ్య, ఆనందం, ప్రభుదాస్, అంజన్‌కుమార్, నరేష్, నర్సయ్య, పాల్గొన్నారు.

**పెగడపల్లి:** మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ సంఘం, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అట్టడుగు వర్గాల ప్రజల కోసం ఆయన చేసిన కృషిని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమాలలో బుర్ర రాములు గౌడ్, ఒరుగల శ్రీనివాస్, మేరుగు శ్రీనివాస్, బొమ్మెన స్వామి, మందపెల్లి అంజయ్య, ఆత్మకూరి చందు, శ్రీరాం అంజయ్య, రాజు, విజయ భాస్కర్, మహేందర్, సంధి మల్లారెడ్డి, రవినాయక్ పాల్గొన్నారు.

**బీర్‌పూర్:** మండలంలోని ఇందిరానగర్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద, తుంగూర్ గ్రామంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు, విద్యావేత్తలు జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

**కోరుట్ల:** డా. బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి పౌరుడు కృషి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మున్సిపల్ చైర్మెన్ అన్నం లావణ్య - అనిల్, కమిషనర్ తిరుపతితో కలసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విగ్రహనికి స్థానిక బీజేపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళ్లను అర్పించారు. సి.ప్రభాకర్ భవనంలో సీపీఐ నాయకులు వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నివాళ్లను అర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బలిజె పద్మ-రాజిరెడ్డి, సజ్, జిందం లక్ష్మీనారాయణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

●దేశ ఉప ప్రధానిగా ఉన్న సమయంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు మరవలేనివని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కౌన్సిలర్లు అడెపు కమల - మధు, ఎంబేరీ నాగభూషణం, మోర్తాడ్ లక్ష్మీనారాయణతో కలిసి పాల్గొన్నారు. జగ్జీవన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ శీలం వేణుగోపాల్, ప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్ పేట భాస్కర్ పాల్గొన్నారు.

**కోరుట్ల రూరల్ :** మండలంలోని అన్ని గ్రామాలలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ప్రజప్రతినిదులు, అంబేద్కర్ సంఘ సభ్యులు ఘ నంగా నిర్వహిచారు. మండలంలోని అన్ని గ్రామాలలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**ధర్మపురి:** దళిత వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అంటూ ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఆయన పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కొలుముల దామోదర్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాజేష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ప్రసాద్, పట్టణ అధ్యక్షులు తిరుపతి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మణ్, మైనార్టీ అధ్యక్షులు ఎండీ రఫియొద్దీన్, శ్రీనివాస్, పాల్గొన్నారు. అలాగే స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు అధ్యక్షులు చందోళి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రాజమల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్, పోచయ్య, భువనేశ్వర్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు రాగుల కాంతయ్య పాల్గొన్నారు.

**మెట్‌పల్లి:** సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తూ భారతదేశానికి విశేష సేవలందించిన ధీరుడు మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కొనియాడారు. శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకుడు జువ్వాడి కృష్ణారావు, బీసీ సంక్షేమ ఆధ్వర్యంలో జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వర్, మెట్‌పల్లి కోర్టు ఆవరణలో న్యాయవాదుల అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మోహన్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

**గొల్లపల్లి:** మాజీ ఉప ప్రధాని స్వర్గీయ డా. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను గొల్లపల్లి మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. మండల కేంద్రంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఈసీ మెంబర్ నల్ల శ్యామ్ పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రమేష్, జాకబు, శ్రీనివాస్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు మధు, అనిల్ పాల్గొన్నారు.

**మెట్‌పల్లి రూరల్ :** జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండలంలోని వేంపేట గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గన్నారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిభూషణ్, లింగం, రవి, సభ్యులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం :** మండల కేంద్రంతో పాటు అయా గ్రామాల్లో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలో మాదిగ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను జరిపారు. నాయకులు రమేష్, నర్సయ్య, అరుణ్, సాగర్ పాల్గొన్నారు.

**మల్యాల:** మండలంలో దివంగత ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్, అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముప్పారపు రామస్వామి, మ్యాక లక్ష్మణ్, నక్క రాజయ్య, లక్ష్మన్, రవీంధర్, రవి, అనిల్ కాంగ్రెస్ నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సాగర్‌రావు, అశోక్ పాల్గొన్నారు

**కథలాపూర్ :** బడుగుల కోసం అనునిత్యం పోరాటాలు చేసిన జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయంలో జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్‌పీటీసీ నాగం భూమయ్య, ఎంపీపీ జవ్వాజి రేవతి, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, శ్రీనివాస్, సుదర్శన్, దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

**వెల్గటూర్:** శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌక్ వద్ద జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేరుగు మురళి, సందీప్‌రెడ్డి, ఉదయ్, నరేష్, వెంకటేష్, శ్రీకాంత్‌రావు, నర్సయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

**జగిత్యాలరూరల్ :** బాబు జగ్జీవన్‌రామ్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని జగిత్యాల రూరల్ తహసీల్దార్ రాంమోహన్ అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని జగిత్యాల రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆర్ఐ భూమయ్య, సల్మాన్‌రాజ్ పాల్గొన్నారు.

**భీమారం:** భీమారం మండల కేంద్రంలో శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను పలువురు కొనియాడారు.



మెట్‌పల్లిలో..



ధర్మపురిలో..



కోరుట్లలో నివాళి అర్పిస్తున్న జువ్వాడి నర్సింగరావు

# రైతులపై కేసీఆర్ మొసలి కన్నీరు

●రైతుల గురించి ఆలోచించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే

●ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

భీమారం, ఏప్రిల్ 5: రైతులపై కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. భీమారం మండ లంలోని వెంకట్రావుపేట, మేడిపల్లి మండలం కాచారం గ్రామాల్లో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచి మొదటి సారిగా వచ్చిన ఆది శ్రీనివాస్‌ను గ్రామస్థులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేగా గెలిపించాలని వచ్చానని, తనపై నమ్మకం ఉంచి వేములవాడ ఎమ్మె ల్యేగా గెలిపించినందుకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. మీలో ఒకడిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం చలి కాలంలో ఏర్పడిందని, వేసవి కాలం అయి పోయి వర్షాకాలంలో వర్షాలు పడకుంటే కరువు వచ్చిందంటే ఒక అర్థం ఉంటుందని, కానీ ఇప్పుడు వర్షాలు పడటం లేదని వాళ్లు చేస్తున్న వాదనలో అర్థం లేదన్నారు. 2018 ఎన్నికల్లో తనను ఓడగొట్టేందుకే బీఆర్ఎస్ పార్టీ వారు కలికోట సూరమ్మ చెరువుకు శిలాఫలకం వేయించారని, కానీ ఆనాటి నుంచి కుడి, ఎడమ కాలువల్లో తట్టెడు మట్టి కూడా తీయలేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ తన ఫాంహౌజ్ నుంచి కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో ఎండిపోయిన పంటలను పరి శీలించేందుకు, ఎకరాకు రూ.25 వేల నష్ట పరిహారం ఇవ్వాలని చెప్పి బయ లుదేరారని అన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి వడగండ్ల వలన నష్టపోయిన రైతులకు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామన్నారు. గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల నేతన్నలకు రూ.275 కోట్లు బకాయి పడ్డారని, వాటిని వారికి ఎందుకు ఇవ్వలేదంటే ఇప్పటివరకు సరైన సమాధానం లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని రైతులు నేడు అధికారం పోగానే గుర్తుకొస్తున్నారని, గతంలో కొండగట్టు ప్రమాదం జరిగినప్పుడు పరామ ర్శించిన పాపాన పోలేదన్నారు. ఆనాడు రైతులకు ఏకకాలంలో రుణ మాఫీ చేశామని, రైతుల గురించి ఆలోచించేది కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి పౌరుడికి మెరుగైన వైద్యం అందేలా కృషి

పెగడపల్లి, ఏప్రిల్ 5 : రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి మెరుగైన వైద్యం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని వెంగళాయిపేట గ్రామానికి చెందిన ఐతరవేని పోచమల్లు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్సకు ఆర్థిక స్థోమత లేక అడ్లూరిని ఆశ్ర యించగా రూ.2.50 లక్షలు మంజూరు చేయించి శుక్రవారం ఎల్‌వోసీని ఆయన కుటుంబ సభ్యులకు అందించారు. అలాగే మండలంలోని వివిద గ్రామాలకు చెందిన పలువురికి రూ. 6.80 లక్షల ఎల్‌వోసీలను అందించినట్లు తెలిపారు. ఆపత్కాలంలో ఎల్‌వోసీ అందించి చికిత్సకు కృషి చేసినందుకు గాను బాదిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు, విప్ లక్ష్మణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇఫ్తార్ విందు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 5 : ముస్లిం, మైనార్టీ సోదరుల అభివృద్ధికి ఎల్లపుడు కృషి చేసేది కాంగ్రెస్ పార్టీ అని రాష్ట్ర సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని వేంపేట గ్రామంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోరుమంతుల ప్రవీణ్‌కుమార్, సురేందర్‌రెడ్డి, కరీం, సలీం, సామిరెడ్డి, శంకర్‌రెడ్డి, ముస్లిం సోదరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ధర్మపురి :** పట్టణంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల రాజేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. విందులో విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ పండుగ ఘణంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షింరు. ముస్లిం సోదరులకు పండుగ శుభాకంక్షలు తెలిపారు.

**మెట్‌పల్లి:** కులమతాలు వేరైనా మనందరం ఒక్కటేనని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా బీఆర్ఎస్ మైనార్టీ పట్టణాధ్యక్షుడు మహమ్మద్ జావిద్ శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. విందులో ఎమ్మెల్యేకు ముస్లిం సోదరులు పండు తినిపించారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అదిరోహించాలి

కోరుట్ల, ఏప్రిల్ 5 : విద్యాలో రాణించి ఉన్నత శిఖరాలను ఆదిరోహించాలని వైద్యుడు రవికిరణ్, మాస్ట్రో కళాశాల కరస్పాడెంట్ ఆకుల రాజేష్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వనతడుపుల రవికుమార్‌లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో పదవ తరగతి విద్యను అభ్యసించిన విద్యార్థుల వీడుకోలు సమావేశానికి ముఖ్యఅతిదులుగా పాల్గొన్ని విద్యార్థులకు విద్యా బోదనను అందించారు. విద్యార్థుల ఆట పాట ఆహ్వానితులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాడెంట్ నీలి శ్రీనివాస్, ప్రదాన కార్యదర్శి చంద్రమోహన్, సభ్యులు అందే శివప్రసాద్, కొత్త సందీప్, అమర్నాథ్, రాజ గంగాధర్, శంకర్, రాజగంగాధర్, శంకర్, ముదిగోండ రాజేశంలతో పాటు పాఠశాల నిర్వహకులు, పాల్గొన్నారు.

# 'జన జాతర' సభకు భారీగా తరలిరావాలి

**ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఏప్రిల్ 5: తుక్కుగూడ జన జాతర సభకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంద సంఘాల ప్రతినిధులు, మహిళలు భారీ సంఖ్యలో తరలి రావాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ధర్మపురి పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుక్కుగూడలో అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీ అధినేత్రి సోనియాగాంధీ విడుదల చేసిన ఆరు గ్యారెంటీ పథకాలకు ఎంతో ఆదరణ లభించిందన్నారు. ప్రజల ఆశీర్వాదంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, అదే సెంటిమెంట్‌తో పాంచ్ న్యాయ్‌కు శ్రీకారం చుట్టునుందని ఆయన అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో, జిల్లాలో కార్యకర్తలను సమన్వయం చేసుకొని జనాన్ని సమీకరించే బాధ్యతలను పార్టీ బాధ్యులు స్వీకరించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, నియోజ కవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, మండల అధ్యక్షుల రాందేని మొగిలి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మణ్, మైనార్టీ అధ్యక్షులు ఎండీ రఫియొద్దీన్, శ్రీనివాస్, సత్యనారాయణ, లక్ష్మణ్, పోచయ్య పాల్గొన్నారు.

### సాగు, తాగు నీరందించడంలో బీఆర్ఎస్ వైఫల్యం

ధర్మపురి నియోజకవర్గంలో సాగు, తాగు నీరందించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందినాదని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. గత సెప్టెంబర్, అక్టోబరులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉందని ఆయన తెలిపారు. వర్షాలు ఆశించినంత రీతిలో కురియలేదని నీటి మట్టం పడిపోయిందని, కాళేశ్వరం కుంగి పోయిందని పేర్కొన్నారు. పంట పొలాలు ఎండిపోవటానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు నియోజకవర్గాలకు సాగు నీరందుతుందని ఆయన అన్నారు. నియోజకవర్గంలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లకు మరమ్మత్తు పేరట నిధులు ఇవ్వలేద న్నారు. రోళ్లవాగు, అక్కపెల్లి చెరువు కింద పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆయన తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో శాశ్వత సాగు నీటి కోసం పరిష్కారం చూపిస్తానని, లేనియెడల రాబోవు ఎన్నికల్లో ప్రజలను ఓటు అడగనని ఆయన అన్నారు.